సాక్షి
ఖమ్మం
బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



పరిహారం ఇంత తక్కువా?
జాతీయ రహదారి భూసేకరణలో ఎకరాకు రూ.33లక్షల పరిహారం ఇస్తామని నోటీసులు జారీ చేయడంపై రైతులు మండిపడుతున్నారు. 8లో



ఫామ్‌లో ఉంటేనే ప్రాధాన్యత!
ఎన్నికల్లో పోటీకి నామినేషన్ల దాఖలు చేసే సమయాన సమర్పించే ఒక్కో ఫామ్‌కు ఒక్కో ప్రత్యేకత ఉంది. 8లో

గరిష్టం / కనిష్టం
41° / 24°
వాతావరణం
జిల్లాలో బుధవారం ఎండ తీవ్రత ఉదయం నుంచే మొదలవుతుంది. సాయంత్రం వరకు వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దాస్పత్రి సూపరింటెండెంట్‌కు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవైద్యవిభాగం: డయాగ్నస్టిక్ హబ్‌లో అన్ని రకాల పరీక్షలు జరగకపోవడంతో ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్‌కు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు మంగళవారం నోటీసులు జారీ చేశారు. అలాగే, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్, డయాగ్నస్టిక్ హబ్ ఇన్‌చార్జ్ సైతం నోటీసులు ఇచ్చారు. హబ్‌లో తరచూ పరీక్షలకు అంతరాయం ఏర్పడుతుండడం, సగం పరీక్షలు కూడా జరగడం లేదనే అంశంపై 'సాక్షి'లో మంగళవారం 'బాలారిష్టాలు దాటని హబ్' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆగ్రహం వ్యక్తం చేయగా.. ప్రిన్సిపాల్ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఈమేరకు సూపరింటెండెంట్, బాధ్యులైన ఇతర అధికారులకు నోటీసులు జారీ చేసిన ఆయన పరీక్షలు ఎందుకు సక్రమంగా జరగడం లేదో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చేవారికి చికిత్సలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి బదిలీ

ఖమ్మంలీగల్: ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్‌జావీద్‌పాషా బదిలీ అయ్యారు. ఆయనను నాంపల్లి ఏడో అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేశారు. అలాగే, ఖమ్మం అదనపు సీనియర్ సివిల్‌జడ్జి కె.ఆశాకుమారిని సికింద్రాబాద్ 22వ అడిషనల్ చీఫ్ మెట్రో పాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక హైదరాబాద్ క్రిమినల్ కోర్టులో న్యాయసేవా సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్న కే.వీ.చంద్రశేఖర్‌రావును ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జిగా, సికింద్రాబాద్ లోని22వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న ఎం.కల్పనను ఖమ్మం అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేటి నుంచి విశాఖకు 'రాజధాని'

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నుంచి విశాఖపట్నంకు కొత్త రాజధాని ఏసీ సర్వీస్‌ను బుధవారం నుండి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9గంటలకు ఖమ్మం కొత్త నుంచి బయలుదేరే ఈ బస్సు రాత్రి 7గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందని పేర్కొన్నారు. అక్కడ రాత్రి 9గంటలకు మొదలై మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు ఖమ్మం వస్తుందని తెలిపారు. ఈ సర్వీస్‌లో చార్జీ రూ.950గా నిర్ణయించగా రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందని డీఎం వెల్లడించారు.

వేసవిలో తరగతులు నిర్వహిస్తే చర్యలు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 24వ తేదీ నుంచి అన్ని యాజమాన్యాల పాఠశాలలు వేసవి సెలవులు పాటించాలని డీఈఓ ఈ.సోమశేఖరశర్మ ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ పాఠశాలలు వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపికైన ప్రభుత్వ బడుల్లో పనులు జరుగుతున్నందున ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని డీఈఓ ఓ ప్రకటనలో సూచించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ



మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్

ముదిగొండ: విరివిగా మొక్కలు నాటడంతోపాటు ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించొచ్చని డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్ తెలిపారు. ముదిగొండ మండలం బాణాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏఐడీ సంస్థ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే ప్రకృతి, పర్యావరణంపై అవగాహన కల్పిస్తే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం లభిస్తుందని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయగా, గ్రామస్తులకు అవగాహన కల్పించేలా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐడీ సంస్థ బాధ్యురాలు వాణి పాఠశాల అభివృద్ధికి రూ.5వేలు అందజేశారు. తహసీల్దార్ రామారావు, ఏఐడీ సంస్థ డైరెక్టర్ హరిప్రసాద్, ఎఫ్‌ఆర్‌ఓ శ్రీనివాసరావు, ఎంఈఓ రామాచారి, హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డితో పాటు రాజేష్, శ్రీనివాస్, రవిచంద్ర, రామదాసు, మాధవి, నాగమణి పాల్గొన్నారు.

ఇక.. చకచకా!

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పర్వం గురువారంతో ముగియనుంది. ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల కాగా, కలెక్టరేట్‌లోని ఆర్‌ఓ కార్యాలయంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ రిటర్నింగ్ అధికారిగా నామినేషన్లు స్వీకరిస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం 17 మంది అభ్యర్థులు 26 సెట్ల నామినేషన్లు సమర్పించారు. మిగిలిన రెండు రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరగనుంది. – సాక్షి ప్రతినిధి, ఖమ్మం



మంత్రి పొంగులేటి వియ్యంకుడు రఘురాంరెడ్డి తరఫున నామినేషన్ సమర్పిస్తున్న నాయకులు బొర్రా రాజశేఖర్, రామ్మూర్తినాయక్, నిరంజన్‌రెడ్డి, స్వర్ణకుమారి, కోటా రాంబాబు

రేపటితో ముగియనున్న నామినేషన్ల దాఖలు గడువు
- ఈ రెండు రోజులు జోరుగా నమోదయ్యే అవకాశం
- రామసహాయం రఘురాంరెడ్డి తరఫున రెండు సెట్లు దాఖలు
- నేడు బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నామినేషన్
- హాజరు కానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

ఆర్భాటాలు లేకుండా..
ఇప్పటి వరకు అభ్యర్థులు హంగూఆర్భాటాలు లేకుండా నామినేషన్లు వేశారు. గత ఎన్నికల్లో భారీ ర్యాలీలతో హంగామా సృష్టించినా, ఈసారి హడావుడి కనిపించలేదు. నామినేషన్ల దాఖలు అనంతరం రోడ్డు షోలకు ప్రధాన పార్టీలు ప్రాధాన్యతను ఇస్తున్నాయి. ప్రతీ ఖర్చు అభ్యర్థి ఖాతాలో జమ కానుండడంతో ర్యాలీలు, సభలు తగ్గించినట్లు తెలుస్తోంది. ప్రధాన పార్టీల్లో బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు నామినేషన్ దాఖలు చేశారు. అదే రోజు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఖమ్మంలో నిర్వహించిన రోడ్డు షోలో పాల్గొని తాండ్రను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇక మంగళవారం వినోద్‌రావు తరఫున బీజేపీ నేతలు మరో రెండు సెట్లు ఆర్‌ఓకు అందజేశారు. అలాగే, స్వతంత్ర అభ్యర్థులు, చిన్నాచితక పార్టీల అభ్యర్థులు సైతం నామినేషన్లు వేశారు. ఈనెల 25వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశముండగా, ఈనెల 29న ఉపసంహరణ గడువు ముగిశాక పోటీలో మిగిలిన అభ్యర్థుల లెక్క తేలుతుంది.

పొంగులేటి వియ్యంకుడి నామినేషన్!
రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డి తరఫున మంగళవారం రెండు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రెస్ నాయకులు మద్దినేని బేబి స్వర్ణకుమారి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, డాక్టర్ కోటా రాంబాబు, రామ్మూర్తినాయక్, నూకల నరేష్‌రెడ్డి, ఎం.డీ.ముస్తఫా, కార్పొరేటర్ మలీదు జగన్, జొన్నలగడ్డ రవి, రమేష్‌లు రిటర్నింగ్ అధికారికి వీటిని అందజేశారు. ఖమ్మం స్థానానికి అభ్యర్థి ఎంపికపై హైదరాబాద్, ఢిల్లీలో పలుమార్లు కసరత్తు జరిగింది. సోమవారం సైతం బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో భేటీ అయ్యారు. టికెట్ విషయమై చర్చించినా అధికారికంగా మాత్రం అభ్యర్థిని ప్రకటించలేదు. కానీ రామసహాయం రఘురాంరెడ్డి తరుఫున మాత్రం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు కావడం విశేషం. నేడో, రేపో ఆయననే అభ్యర్థిని ప్రకటిస్తారని.. చివరి రోజు రఘురాంరెడ్డి జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులతో కలిసి చివరి సెట్ నామినేషన్ సమర్పిస్తారనే ప్రచారం జరుగుతోంది.

ఖమ్మం స్థానానికి ఇప్పటి వరకు దాఖలైన నామినేషన్లు

తేది	అభ్యర్థులు	నామినేషన్లు
18	01	01
19	01	01
20	01	02
22	07	11
23	07	11
మొత్తం	17	26

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

నేడు నామా..
ప్రధాన పార్టీల్లో బీఆర్‌ఎస్ తమ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావును తొలుత ప్రకటించింది. ఇప్పటికే ఆయన లోక్‌సభ స్థానం పరిధిలో ఒక విడత ప్రచారం కూడా పూర్తి చేశారు. ఈమేరకు ఆయన బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్‌తోపాటు ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, పార్లమెంట్ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఉదయం 11గంటలకు నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఖమ్మంలోని సీక్వెల్ ఫంక్షన్ హాల్‌లో జరిగే లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల సమావేశంలో హరీశ్‌రావు ప్రసంగిస్తారు. ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం చేయడంతో పాటు కేసీఆర్ బస్సుయాత్ర రూట్‌మ్యాప్, ఏర్పాట్లపై చర్చించనున్నట్లు తెలిసింది.

సమష్టి కార్యాచరణతో ప్రశాంతంగా ఎన్నికలు

- రెండుచోట్ల ఓటు వేయకుండా అప్రమత్తం
- అంతర్రాష్ట్ర సమన్వయ సమావేశంలో కలెక్టర్ గౌతమ్



ఖమ్మం సహకారనగర్/ఖమ్మం క్రైం: సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఏపీలోని ఏలూరు జిల్లా కలెక్టర్ వి.ప్రసన్న వెంకటేష్ ఆధ్వర్యాన అంతర్రాష్ట్ర అధికారుల సమావేశాన్ని ఆన్‌లైన్‌లో నిర్వహించగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్లు, మూడు జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు. తొలుత ఏలూరు కలెక్టర్ మాట్లాడుతూ సరిహద్దు జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, చెక్‌పోస్టుల వద్ద 24 గంటలు నిఘా ఉంచడమే కాక సమాచారం పరస్పరం ఇచ్చిపుచ్చుకోవాలని తెలిపారు. అనంతరం ఖమ్మం కలెక్టర్ మాట్లాడుతూ డబ్బు, మద్యం రవాణా నియంత్రణకు విస్తృతంగా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే, ఖమ్మం జిల్లాలో పనిచేస్తూ ఏలూరులో, ఏలూరులో పనిచేస్తూ ఖమ్మం జిల్లాలో ఓటు హక్కు కలిగిన వారి ఓట్లను ఫారం–8 ద్వారా బదిలీకి చర్యలు చేపట్టామని, అలాంటి వారు ఒకే చోట ఓటు వేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఇదే సమావేశంలో పోలీసు కమిషనరేట్ నుంచి సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకుంటున్న చర్యలతో పాటు చెక్‌పోస్టు వద్ద తనిఖీల వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక, భద్రాద్రి, ఏలూరు ఎస్పీలు రోహిత్‌రాజ్, మేరీ ప్రశాంతి, మూడు జిల్లాల్లోని వివిధ శాఖల అధికారులు మురళీధర్‌రావు, శ్రీనివాసరెడ్డి, నాగేంద్రరెడ్డి, ఏ.శ్రీనివాస్, ఆఫ్రిన్ సిద్దిఖీ, సిద్దార్థ విక్రమ్‌సింగ్, జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.శ్రీరామ్, ఎం.ఏ.గౌస్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా

బోనకల్: బోనకల్ మండలంలోని రావినూతల, జానకీపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ జి.మధుసూదన్ నాయక్ మంగళవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో వసతులపై ఆరా తీసిన ఆయన గాలి, వెలుతురు సక్రమంగా వచ్చేలా చూడడంతో పాటు టాయిలెట్లు, ఇతర సౌకర్యాలపై సూచనలు చేశారు. తహసీల్దార్ పున్నంచందర్, ఎంపీడీఓ రాజూనాయక్, ఆర్‌ఐ లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శులు గోపీచంద్, అశోక్ ఉన్నారు.



రావినూతలలో పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దు
ఖమ్మం సహకారనగర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. జిల్లాలోని పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో పర్యటించిన ఆయన ధాన్యం కొనుగోళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నీడ కోసం టెంట్లు వేయించడమే కాక కుర్చీలు, తాగునీటి సౌకర్యం ఏర్పాట్లు చేయాలన్నారు. పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శ్రీలత, డీటీలు దర్గయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం..

బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు

వేంసూరు/పెనుబల్లి: కేంద్రంలో మూడోసారి మోదీ నేతృత్వాన ప్రభుత్వం ఏర్పాటుచేయనున్నందున ఖమ్మంలో తనను గెలిపిస్తే జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు వెల్లడించారు. వేంసూరు మండలం, పెనుబల్లి మండలం పెనుబల్లి, వీఎం బంజర్‌ల్లో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వినోద్‌రావు మాట్లాడుతూ గతంలో గెలిచిన వారు జిల్లా అభివృద్ధికి కృషి చేయకపోగా, పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించలేదని తెలిపారు. ఈసారి తనకు అవకాశమిస్తే విద్య, వైద్యం సహా అన్నిరంగాల్లో జిల్లాను ముందంజలో నిలుపుతానని వెల్లడించారు. బీజేపీ నాయకులు పర్సా రాంబాబు, నంబూరి రామలింగేశ్వరరావు, బొర్రా నరసింహారావు, వీరంరాజు, మట్టా ప్రసాద్, బాలకృష్ణ, దొడ్డపునేని కృష్ణయ్య, చంద్రమోహన్ రెడ్డి చల్లా అప్పిరెడ్డి, పడిగల మధుసూధన్‌రావు, నాయుడు రాఘవరావు, మున్నా మిశ్రా, రాము, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వేంసూరులో ప్రచారం చేస్తున్న వినోద్‌రావు

విద్యుత్ ఉద్యోగులకు రూ.కోటి బీమా సౌకర్యం

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

ఖమ్మంవ్యవసాయం/సత్తుపల్లి టౌన్: విద్యుత్ ఉద్యోగులకు రూ.కోటి బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని విద్యుత్ గెస్ట్‌హౌస్‌లో ఉద్యోగులకు ఏర్పాటుచేసిన శిక్షణ తరగతుల్లో మంగళవారం ఆయన పాల్గొన్నారు. విద్యుత్ అంతరాయాలను అధిగమించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా కృషిచేయాలని సూచించారు. ఇదేసమయాన అక్రమ విద్యుత్ వాడకాన్ని అరికడితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. అంతకుముందు సత్తుపల్లి డివిజన్ కార్యాలయాన్ని సీఎండీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఉద్యోగులకు సూచించారు. ఆయనకు ఉద్యోగులు స్వాగతం పలకగా.. ఉద్యోగులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కొత్త సబ్‌స్టేషన్లు, సత్తుపల్లి మండలం కిష్టారం నుంచి కందుకూరుకు లింక్ లైన్ ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈసమావేశాల్లో ఎస్‌ఈ ఏ.సురేందర్, డీఈలు బాబూరావు, నంబూరి రామారావు, నాగేశ్వరరావు, హీరాలాల్, ఈఈ వెంకటేశ్వరరావు, ఎస్‌ఏఓ శ్రీధర్, డీఈఈ ఎల్.రాములు, ఏడీఈ ప్రసాద్‌బాబు, ఏఈలు శరత్‌బాబు, సుజాత తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉద్యోగుల ఖాళీలు భర్తీ చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) జిల్లా అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యాన సీఎండీకి వినతిపత్రం అందజేశారు. వివిధ విభాగాల్లో ఖాళీలు ఉండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఆర్.నాగేందర్ కుమార్, యుగంధర్, రామారావు, అరుణ్, నాగేశ్వరరావు, పూర్ణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో సీఎండీ వరుణ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అధికారులు

ఓటర్లకు ఇబ్బంది కలగనివ్వొద్దు..

వేంసూరు: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా వసతులు కల్పించాలని జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్ సూచించారు. మండలంలోని భీమవరంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు. ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ వినోద్

బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం

- సుదర్శన చక్రానికి గోదావరిలో చక్రస్నానం
- రామయ్యకు ప్రత్యేక స్నపనం



స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 9న ప్రారంభమైన వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక తిరుకలాణ బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు స్వామివారి సుదర్శన చక్రానికి పవిత్ర గోదావరి నదిలో చక్రస్నానం వేడుకను నిర్వహించారు. సుదర్శన చక్రాన్ని, ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీలో మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ గోదావరి నది వద్ద గల పునర్వసు మండపానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ మూర్తులకు మండపంలో స్నపన తిరుమంజనం, హారతి సమర్పించారు. అనంతరం గోదావరిలో సంప్రదాయబద్ధంగా చక్రస్నానం నిర్వహించారు. ఆతర్వాత యాగశాలలో పుష్పయాగం, పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ఈఓ రమాదేవి, అర్చకులు పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిలిపివేసిన స్వామివారి నిత్యకల్యాణాలు, దర్బారు సేవలు బుధవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయని ఈఓ రమాదేవి వెల్లడించారు.

ఎండ ప్రచండం

జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతకు తోడు వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 40 నుంచి 45 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కల్లూరులో మంగళవారం అత్యధికంగా 44.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా జిల్లా కేంద్రంలో 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా ప్రాంతాల్లో కూడా 40డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉదయం 8గంటలకే ఎండ ప్రభావం మొదలై పది గంటల తర్వాత మరింత తీవ్రమవుతోంది. సాయంత్రం 5 గంటల వరకు కూడా వడగాలులు వీస్తుండడంతో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. – ఖమ్మంవ్యవసాయం



వీ.వీ.పాలెం వద్ద ఎండవేడికి నేలరాలిన పక్షి

'లక్ష'ణంగా ఉపాధి!



ఖమ్మం రూరల్ మండలంలో పనికి హాజరైన కూలీలు

- జిల్లాలో లక్ష దాటిన కూలీల సంఖ్య
- వ్యవసాయ పనులు లేక ఇటువైపు మొగ్గు
- మండే ఎండల్లోనూ జోరుగా పనులు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంత కూలీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తున్నాయి. వ్యవసాయ పనులు, వ్యవసాయేతర పనులు లేని సమయాన గ్రామీణ ప్రాంత కూలీలకు ఈ పథకం వరంలా మారుతోంది. జిల్లాలో ఈ పనులను ఉపయోగించుకునే కూలీల సంఖ్య ఎక్కువగానే ఉండగా... మంగళవారం పనికి వచ్చిన వారి సంఖ్య లక్ష దాటింది. ఈమేరకు గత వారం అత్యధికంగా 96,378 మంది కూలీలు పనికి రాగా.. మంగళవారం 1,00,170 మంది పనికి వచ్చారని అధికారులు వెల్లడించారు. ఈ సంఖ్య రానురాను మరింత పెరిగే అవకాశముందని తెలుస్తోంది.ఈ ఏడాది వర్షాభావం, సాగర్ జలాల లభ్యత లేక వ్యవసాయ పనులు ముందుగానే ముగియడంతో ఎక్కువ మంది కూలీలు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల బాట పడుతున్నారు.

మండే ఎండల్లోనూ..
ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఎండను సైతం లెక్క చేయడం లేదు. వ్యవసాయ పనులు లేక ఏడాది కూలీలు, పేదలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యాన ఉపాధి పనులకు వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ పనులకు హాజరవుతున్నారు. దీంతో కూలీలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు నీడ కోసం టెంట్లు వేయించడమే కాక తాగునీటి సౌకర్యం కల్పించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కూడా సమకూరుస్తున్నారు.

కూలీలకు సౌకర్యాలు కల్పిస్తున్నాం..
ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరుగుతోంది. దీంతో వారికి అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నాం. పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లతో పాటు ఓఆర్‌ఎస్, తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుతున్నాం. రాబోయే రోజుల్లో కూలీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకు తగినట్లుగా పనులు గుర్తిస్తున్నాం.
– ఆర్.సన్యాసయ్య, డీఆర్‌డీఓ

మండలాల వారీగా మంగళవారం పనులకు హాజరైన కూలీల సంఖ్య

మండలం	కూలీల సంఖ్య
రఘునాథపాలెం	6,801
కూసుమంచి	6,053
నేలకొండపల్లి	6,012
ఎర్రుపాలెం	5,876
తిరుమలాయపాలెం	5,584
సింగరేణి	5,359
తల్లాడ	5,353
కల్లూరు	5,301
కామేపల్లి	5,230
కొణిజర్ల	5,100
చింతకాని	4,980
పెనుబల్లి	4,944
ఖమ్మంరూరల్	4,927
ఏన్కూరు	4,778
బోనకల్	4,507
వైరా	4,433
మధిర	4,382
వేంసూరు	4,179
ముదిగొండ	3,801
సత్తుపల్లి	2,570
మొత్తం	1,00,170

క్లుప్తంగా

ఎస్‌సీఈఆర్‌టీ సెమినార్‌కు ఎంపిక



ప్రభాకర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యాన నిర్వహించే రాష్ట్రస్థాయి సెమినార్‌కు మండలంలోని తిరుమలాయపాలెం జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి ఎంపికయ్యారు. ఫిబ్రవరిలో జరిగిన సెమినార్‌కు 33 జిల్లాల నుండి ఉపాధ్యాయులు వ్యాసాలను పంపించగా 31 మంది వ్యాసాలను ఎంపిక చేశారు. ఇందులో ప్రభాకర్‌రెడ్డి రాసిన 'జీవ వైవిధ్యాన్ని పరిరక్షించు' వ్యాసం కూడా ఉండడంతో, ఈనెల 25, 26వ తేదీల్లో జరిగే సెమినార్‌కు హాజరుకానున్నారు. ఆయనను ఎంఈఓ రామాచారి, నోడల్ అధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



అజ్మీరా రమేష్ (ఫైల్)

తిరుమలాయపాలెం: మండలంలోని కొక్కిరేణి స్టేజీ సమీపాన సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అజ్మీరా రమేష్(38) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఎదుళ్లచెరువుకు చెందిన ప్రొక్లెయినర్ ఆపరేటర్ అజ్మీరా రమేష్ సోమవారం రాత్రి ఖమ్మం నుండి ఇంటి వస్తుండగా మోటార్‌సైకిల్ అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి దాటాక మృతి చెందాడు. రమేష్‌కు భార్య ఉమ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతురాలి ఆచూకీ లభ్యం

చింతకాని: మండలంలోని వందనంలో సోమవారం మృతి చెందిన మహిళ ఆచూకీ గుర్తించారు. నిజామాబాద్ జిల్లా సారంగపూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన ఉపతల పోచమ్మ(67) ఖమ్మంలోని వైఎస్సార్ కాలనీలో కొన్నేళ్లుగా నివాసముంటున్న తన కుమారుడు రాజు వద్దకు వారం క్రితం వచ్చింది. ఆమెకు కల్లు తాగే అలవాటు ఉండగా, కొంతకాలంగా నుంచి మతిస్థిమితం కూడా సక్రమంగా లేదు. దీంతో ఆదివారం ఉదయం కల్లు కోసం బయటకు వచ్చి వందనం సమీపాన పంట పొలాల్లో ఎండ తీవ్రతకు మృతి చెందింది. ఈమేరకు బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని అప్పగించినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో మూడు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో ఖమ్మం యూపీహెచ్ కాలనీకి చెందిన దొడ్ల లింగయ్యకు మూడు నెలల జైలు శిక్ష విధించడంతో పాటు ఫిర్యాదికి రూ.2లక్షలు చెల్లించాలని ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి కాసరగడ్డ దీప తీర్పు చెప్పారు. మంగళవారం వెలువరించిన తీర్పు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంలోని పాండురంగాపురానికి చెందిన విన్నకోట సంతోష్‌కుమార్ వద్ద లింగయ్య వ్యాపార నిమిత్తం 2019 నవంబర్ 19న రూ.1.50 లక్షలు తీసుకున్నాడు. ఆతర్వాత ఆయన జారీ చేసిన చెక్కును బ్యాంకులో జమ చేస్తే చెక్కు నిలిపేయమన్నట్లు బ్యాంకు వారు సమాచారం ఇచ్చారు. దీంతో సంతోష్ తన న్యాయవాది ద్వారా కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేయడంతో న్యాయమూర్తి విచారించాక జైలు శిక్షతో పాటు రూ.2లక్షలు చెల్లించాలనితీర్పు చెప్పారు.

పల్లె దవాఖానాలో అక్రమంగా విద్యుత్ వాడకం

- సరఫరా నిలిపివేసిన అధికారులు

కారేపల్లి: మండలంలోని విశ్వనాథపల్లిలో పల్లె దవాఖానాకు విద్యుత్ సరఫరాను ట్రాన్స్‌కో అధికారులు నిలిపివేశారు. మీటర్ కోసం దరఖాస్తు చేసుకోకుండా, అనధికారంగా లైన్ తీసుకుని విద్యుత్ వాడుకుంటున్నట్లు తేలడంతో ఈ చర్యలు తీసుకున్నారు. ఐదేళ్ల క్రితం విశ్వనాథపల్లిలో పల్లె దవాఖానా పేరిట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నిర్మించారు. అప్పుడు విద్యుత్ సరఫరా లేకుండానే హడావుడిగా ప్రారంభించారు. ఆతర్వాత కూడా మీటర్ కోసం దరఖాస్తు చేసుకోకపోగా, వైద్య సిబ్బంది అనధికారంగా లైన్ తీసుకొని విద్యుత్ వినియోగించుకుంటున్నారు. ఈ విషయమై పలుమార్లు సూచనలు చేసినా పట్టించుకోకపోవడంతో ట్రాన్స్‌కో అధికారులు లైన్‌ను తొలగించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
మొక్కజొన్న	2,140	2,080
పెసలు	8,000	5,000
కందులు	10,700	9,000
బొబ్బెర్లు	8,450	7,500
మిర్చి	18,700	10,000
తాలు మిర్చి	9,800	8,000
పత్తి	7,200	5,800

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,174

ఐదో రోజు.. 11 సెట్లు

జోరందుకున్న నామినేషన్ల స్వీకరణ

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం లోక్‌సభ స్థానానికి ఐదో రోజైన మంగళవారం ఏడుగురు అభ్యర్థులకు సంబంధించి 11 సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. మంత్రి పొంగులేటి వియ్యంకుడు రామసహాయం రఘురాంరెడ్డికి తరఫున రెండు సెట్ల నామినేషన్లను కాంగ్రెస్ నాయకులు దాఖలు చేశారు. అలాగే, బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరఫున పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లాసత్యనారాయణ, నాయకులు సుగ్గల వెంకటేశ్వరరావు, గెంటాల విద్యాసాగర్ తదితరులు నామినేషన్ సమర్పించారు. ఇక సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా రయీస్ అన్వర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఏవీజే.ప్రసాద్, స్వతంత్రులు కట్టకొజ్వల నాగేశ్వరరావు, ఆవుటపల్లి రామలింగేశ్వరరావు, కాశిమల్ల నాగేశ్వరరావు ఒక్కో సెట్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థిగా షేక్ సిరాజుద్దీన్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు.



రయీస్ అన్వర్ (సోషలిస్ట్ పార్టీ)



కట్టకొజ్వల నాగేశ్వరరావు (స్వతంత్ర)



ఏవీజే.ప్రసాద్ (పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా)



అవుటపల్లి రామలింగేశ్వరరావు (స్వతంత్ర)



కాశిమల్ల నాగేశ్వరరావు (స్వతంత్ర)




సిరాజుద్దీన్ (స్వతంత్ర)



బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తరఫున నామినేషన్ సమర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు

'ఫామ్'లో ఉంటేనే ప్రాధాన్యత ! నచ్చకపోతే 'నోటా'

- ఒక్కో ఎన్నికకు ఒక్కో రకం నంబర్
- ప్రతీ ఫామ్‌కు ఓ లెక్క
- బీ ఫామ్ ఆధారంగా గుర్తుల కేటాయింపు..



ఖమ్మం సహకారనగర్/ఖమ్మం మయూరిసెంటర్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఈనెల 18న విడుదలైంది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారి ఫాం–1 ద్వారా నోటిఫికేషన్ జారీ చేశారు. నాటి నుండి అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. ఇందులోనే అభ్యర్థులు నామినేషన్ ఎప్పుడు, ఎక్కడ, ఏ సమయాన, ఎవరికి దాఖలు చేయాలో స్పష్టంగా ప్రస్తావించారు. అలాగే, నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు సంబంధించిన వివరాలనూ పొందుపర్చారు. వీటితో పాటు పోలింగ్ ఏ రోజు, ఎప్పుడు జరుగుతుందో కూడా వెల్లడించారు. ఇందులోని వివరాల ఆధారంగానే అభ్యర్థులు ముందుకు సాగాల్సి ఉంటుంది. అలాగే, ఎన్నికల వేళ వివిధ నంబర్లతో జారీ చేసిన ఫామ్‌లకు ప్రాధాన్యత ఉంటుంది.

ఫాం-2

లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ఫాం–2ఏ ద్వారా నామినేషన్ దాఖలు చేయాలి. ఈ ఫామ్‌నే నామినేషన్ పత్రంగా పేర్కొంటారు. శాసనసభకు ఫాం–బీ, రాజ్యసభ, శాసన మండలికి ఫాం–2సీలో నామినేషన్ సమర్పిస్తారు. అభ్యర్థులకు నామపత్రాలను కేంద్ర ఎన్నికల సంఘమే ఉచితంగా సమకూరుస్తుంది. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నామపత్రాలకు సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయంతో పాటు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోని సహాయ రిటర్నింగ్ అధికారి లేదా తహసీల్ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచారు. వీటిని పూరించడంలో సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు హెల్ప్ డెస్క్‌లు సైతం ఏర్పాటుచేశారు.

ఫామ్-ఏ

రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల పేర్లను ఫాం–ఏ ద్వారా తెలియజేస్తాయి. వీటిపై ఆయా రాజకీయ పార్టీల అధ్యక్షులు లేదా ప్రధాన కార్యదర్శి సంతకంతో పాటు ముద్ర ఉంటుంది. పార్టీ ఎవరిని అభ్యర్థిని ఎంపిక చేసిందో చెప్పేదే ఈ ఫామ్. ఇందులో పార్టీ పేరు, పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి పేరు తదితర వివరాలు ఉంటాయి.

ఫామ్-బీ

పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థి వీరే అని పార్టీ ప్రతినిధి ఇచ్చేదే బీ–ఫామ్. దీన్ని నామినేషన్ సమయాన ఎన్నికల అధికారులకు అందజేయాలి. నామినేషన్ల చివరి రోజు మధ్యాహ్నం 3గంటల్లోపు అందచేయెచ్చు. సదరు పత్రంలో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు, నియోజకవర్గ వివరాలతో పాటు పార్టీ అధ్యక్షుడి సంతకం ఉంటుంది. నామినేషన్‌తో పాటు అభ్యర్థి బీ–ఫామ్‌ను జతచేస్తేనే రిటర్నింగ్ అధికారి ఆ పార్టీ ఎన్నికల గుర్తు కేటాయిస్తారు. అభ్యర్థి సమర్పించే ఫామ్–ఏ, బీలను పరిశీలించి అభ్యర్థి సదరు పార్టీ తరఫున పోటీ చేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థి సకాలంలో సరైన ఫామ్ సమర్పించకపోవడంతో నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఇలాంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని అన్ని వివరాలు, పత్రాలు సరిచూసుకోవాల్సి ఉంటుంది.

అఫిడవిట్‌కూ ప్రాధాన్యత

నామినేషన్ పత్రంతో పాటు ఫామ్–26(అఫిడవిట్) సైతం అభ్యర్థులు విధిగా సమర్పించాలి. ఇందులో అభ్యర్థులు తమతో పాటు కుటుంబ సభ్యుల ఆస్తులు, అప్పులు వివరాలను పొందుపర్చాలి. అలాగే, క్రిమినల్ కేసులు, న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల వివరాలు పొందుపర్చాల్సి ఉంటుంది.

- ఈవీఎంల్లో ప్రత్యేక గుర్తు
- సరైన అభ్యర్థులు లేకున్నా ఓటు వేసే వీలు
- గత లోక్‌సభ ఎన్నికల్లో 15,832 ఓట్లు

ఖమ్మంసహకారనగర్: త్వరలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ జరగనుంది. అయితే, చాలా మంది పోలింగ్ దూరంగా ఉంటుండడంతో ఎన్నికల సంఘం విస్తృతంగా అవగాహన చేపడుతోంది. ప్రతీఒక్కరికి పోలింగ్ స్టేషన్‌కు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నా సరైన అభ్యర్థులు లేరనే భావనతో కొందరు విముఖ చూపుతున్నారు. ఈనేపథ్యాన ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా ఎన్నికల సంఘం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈవీఎంల్లో నోటాను ప్రవేశపెట్టింది. ఎన్నికల సంఘం నోటాను 2014లో ప్రవేశపెట్టగా.. చట్టసభల్లో పోటీ చేసే అభ్యర్థులెవరూ నచ్చకపోయినా తమ అభిప్రాయాన్ని తెలపడం కోసం ఇది ఉపయోగపడుతోంది.

రెట్టింపైన ఓట్లు

2014 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 2019 లోక్‌సభ ఎన్నికల నాటికి నోటాకు నమోదైన ఓట్ల సంఖ్య రెట్టింపైంది. 2014 ఎన్నికల్లో 4,991ఓట్లు నోటాకు రాగా...2019కు వచ్చే సరికి 15,832ఓట్లు నమోదు కావడం గమనార్హం. పార్టీలు ఇచ్చిన హామీలను విస్మరించడం, అభ్యర్థులు అభివృద్ధి చేస్తారనే నమ్మకం లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని భావిస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో 5,549నోటాకు ఓట్లు పోల్‌కాగా.. కొత్తగూడెం నియోజకవర్గంలోనూ 3,036ఓట్లు నమోదు కాగా.. ఈ సారి ఎలా ఉంటుందోనన్న చర్చ జరుగుతోంది.



గత రెండు ఎన్నికల్లో 'నోటా'కు నమోదైన ఓట్లు

నియోజకవర్గం	2014	2019
ఖమ్మం	1,668	5,549
పాలేరు	523	1,973
మధిర	363	1,449
వైరా	406	1,357
సత్తుపల్లి	412	1,509
కొత్తగూడెం	974	3,036
అశ్వారావుపేట	632	929
మొత్తం	4,991	1,5832

ఓటర్ అవగాహనకు బైక్ యాత్ర

ఖమ్మంసహకారనగర్: లోక్‌సభ ఎన్నికల్లో వంద శాతం ఓటింగే లక్ష్యంగా కల్లూరు మండలం చెన్నూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ చేపట్టిన అవగాహన బైక్ యాత్రను మంగళవారం ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా ఓటర్ అవగాహన యాత్ర చేస్తున్న సుధాకర్ అభినందనీయుడన్నారు. అనంతరం సుధాకర్ మాట్లాడుతూ తాను గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ యాత్ర చేపట్టానని తెలిపారు.



యాత్ర చేపడుతున్న సుధాకర్‌తో కలెక్టర్ గౌతమ్, అధికారులు

పరిహారం ఇంత తక్కువా ?

నేషనల్ హైవే భూసేకరణకు నోటీసులు

రఘునాథపాలెం: భూమి ధర ఎకరానికి రూ.5 కోట్లకు పైగా పలుకుతుండగా... ప్రభుత్వం జాతీయ రహదారి నిర్మాణం పేరుతో సేకరణకు సిద్ధమైంది. అలైన్‌మెంట్ మార్చాలని ఓ పక్క రైతులు కోరుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోకుండా ఎకరాకు రూ.33 లక్షలుగా ధర నిర్ణయించి రైతులకు నోటీసులు జారీ చేయడంపై బాధితులు మండిపడుతున్నారు. నాగపూర్–అమరావతి నేషనల్ హైవే రోడ్డు నిర్మాణానికి గుర్తించిన భూములకు సంబంధించి రైతులకు ఖమ్మం ఆర్‌డీఓ పేరిట రైతులకు రెండు రోజుల నుంచి నోటీసులు అందుతున్నాయి. రఘునాథపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో 20 మంది రైతులకు నోటీసులు అందగా.. నగరానికి ఆనుకుని ఉన్న ఇక్కడి భూముల్లో ఎకరాకు రూ.33లక్షల పరిహారం ఇస్తామని చెప్పడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అలాగే, భూమికి తప్ప అందులో బోర్లు, పైపులైన్లు, ఫెన్సింగ్ ఏవీ లెక్క కట్టకపోవడంపై మండిపడుతున్నారు. అంతేకాక ఇద్దరు ముగ్గురు భూములకు కలిపి ఒకే నోటీసు ఇస్తుండడంతో ఏం చేయాలో తెలియక లబోదిబోమంటున్నారు. జాతీయ రహదారుల చట్టం ప్రకారం నోటీసు అందిన 60రోజుల్లోగా తహసీల్దార్‌కు భూమి స్వాధీనం చేయాలని సూచించడంతో తమకు న్యాయం చేయాలంటూ పలువురు రైతులు మంగళవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ధర తక్కువగా ఉన్న భూమిలో నుంచి రహదారి వెళ్లేలా అలైన్‌మెంట్ మార్చాలని కోరినట్లు తెలిసింది.



మంత్రి తుమ్మలకు వినతిపత్రం ఇచ్చిన రైతులు

పంట రుణాలు వసూలు చేయండి



చైర్మన్ దొండపాటిని సత్కరిస్తున్న చైర్మన్లు, ఉద్యోగులు

ఎర్రుపాలెం: పంట రుణాల వసూళ్లలో వేగం పెంచాలని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని బనిగండ్లపాడులో సొసైటీ గోదాం నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని డీసీసీబీ కార్యాలయంలో ఏజీఎం కృష్ణమోహన్, మేనేజర్ మగినం వీరభద్రం, సొసైటీల చైర్మన్లు, సీఈఓలతో సమావేశమైన చైర్మన్ మాట్లాడారు. పంట రుణాల రెన్యువల్ పూర్తి చేసిన చైర్మన్లు, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను ఉద్యోగులు, చైర్మన్లు సత్కరించారు. చైర్మన్లు అనుమోలు సాంబశివరావు, మూల్పూరు శ్రీనివాసరావు, వెన్నపూస కృష్ణారెడ్డి, శీలం అక్కిరెడ్డి, ఉద్యోగులు నాగలక్ష్మి, భానుప్రియ, మహేష్‌బాబు, శివారెడ్డి, ఏసుబాబు, మోహన్ రావు, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంలో ధ్వజస్తంభం వద్ద నామ నాగేశ్వరరావు

దేవా.. మరోమారు కనికరించు...

భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో బీఆర్‌ఎస్ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి నామ నాగేశ్వరరావు మంగళవారం పూజలు చేశారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులను దర్శించుకున్నారు. అలాగే, పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో కూడా నామ పూజలు చేశారు. బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా ఆలయాల్లో పూజలు చేసినట్లు ఆయన తెలిపారు. అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, ఆకోజు సునీల్‌కుమార్, కోలా రాజు, టీడీపీ నాయకుడు ఎస్.కే.అజీమ్ తదితరులు పాల్గొన్నారు. – భద్రాచలం/పాల్వంచ రూరల్

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కామేపల్లి: రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెంకు చెందిన నిరుకొండ ఉపేందర్(43) సోమవారం తాళ్లగూడెం పెద్దమ్మతల్లి దేవాలయం సమీపాన బైక్ అదుపు తప్పడంతో జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. ఆయనను ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఘటనపై ఉపేందర్ భార్య ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పాముకాటు బాధితురాలి ప్రాణం కాపాడిన వైద్యులు

ఖమ్మంవైద్యవిభాగం: పాముకాటుకు గురై ప్రాణాపాయ స్థితికి ఉన్న బాలిక ప్రాణాలను ఖమ్మం పెద్దాస్పత్రి వైద్యులు కాపాడారు. తిరుమలాయపాలెం మండలం హస్నాబాద్‌కు చెందిన వెంకన్న, లక్ష్మి దంపతుల కుమార్తె మాగి స్పందన సుబ్లేడ్‌లో ఇంటర్ చదువుతోంది. గత శుక్రవారం వారు పక్కింటి దాబాపై పడుకోగా, అర్ధరాత్రి స్పందనను కట్లపాము కాటేసింది. దీంతో ఆమెను 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చేసరికే అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అంతకంతకూ పరిస్థితి జఠిలంగా మారుతుండడం, ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లే స్థోమత తల్లిదండ్రులకు లేకపోవడంతో డాక్టర్ నారగోని రాంప్రసాద్ ఆధ్వర్యాన బాలికను ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. ఆమె పూర్తిగా నీరసించి, న్యూరో పెరాలసిస్ వంటి సమస్యలతో ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లగా వైద్యుల నిరంతర పర్యవేక్షణలో చికిత్స చేస్తూ సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ఈమేరకు స్పందన కోలుకోగా మంగళవారం డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంప్రసాద్, సిబ్బందిని సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ బి.అమర్‌సింగ్ అభినందించగా, బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



బాలిక ఆరోగ్యంపై ఆరా తీస్తున్న సూపరింటెండెంట్, ఆర్‌ఎంఓ

గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి

కొణిజర్ల: ద్విచక్రవాహనంపై వెళ్తున్న పంచాయతీ కార్మికుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. కొణిజర్ల మండలం శాంతినగర్ సమీపాన సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు.. తల్లాడ మండలం వెంగన్నపేట(గూడూరు) పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ పాలకుర్తి ప్రసాద్(24) తన అమ్మమ్మ ఊరైన కొణిజర్ల మండలం లాలాపురంలో శుభకార్యం నిమిత్తం సోమవారం రాత్రి తన తండ్రి జాన్ ఏసుతో ద్విచక్రవాహనంపై వచ్చాడు. ఆతర్వాత తిరిగి రాత్రి 12 గంటలకు గూడూరు బయలుదేరిన ఆయన శాంతినగర్ జశ్వంత్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పెట్రోల్ కొట్టించుకునేందుకు వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈఘటనలో ప్రసాద్ తలకు తీవ్ర గాయం కావడంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి జాన్‌ఏసు బధిరుడు కావడంతో ఆయన స్థానంలో జీపీలో పనిచేస్తున్న ప్రసాద్ మృతితో కుటుంబంలో విషాదం నెలకొంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జె.శంకర్‌రావు తెలిపారు.



పాలకుర్తి ప్రసాద్ (ఫైల్)

హెడ్ కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

ఖమ్మంఅర్బన్: ఖమ్మం శ్రీరాంనగర్‌రోడ్డు–10లో నివాసముంటున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ టి.రంగా భార్య స్వప్న(38) మంగళవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినది. భర్త విధులకు వెళ్లాక మధ్యాహ్నం ఇద్దరు కుమారులతో కలిసి ఆమె భోజనం చేసింది. ఆతర్వాత గదిలోకి వెళ్లి ఉరి వేసుకుంది. కాసేపటికి పెద్ద కుమారుడు తలుపు కొడుతుంటూ ఎంతకూ తీయకపోవడంతో కిటికీలో నుంచి ఉరికి వేలాడుతుండడంతో స్థానికులకు సమాచారం ఇచ్చాడు. వారు చేరుకుని తలుపు పగలగొట్టే సరికి ఆమె మృతి చెందింది. కాగా, స్వప్న ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈమేరకు విధుల్లో భాగంగా హైదరాబాద్ వెళ్లిన ఆమె భర్త రంగాకు సమాచారం ఇచ్చారు.

పొలాల్లో చెత్తకు నిప్పు, కాలిపోయిన మోటార్లు

నేలకొండపల్లి: ప్రమాదవశాత్తు వరి చేనులో కొయ్య కాళ్లకు నిప్పంటుకోగా, మంటలు వేగంగా ఎగిసిపడడంతో వ్యవసాయ మోటార్లు, పైపులైన్లు కాలిబూడిదయ్యాయి. మండలంలోని చెరువుమాధారంలో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు వరి పొలాల్లో చెత్తకు మంట అంటుకుంది. గాలి బలంగా వీస్తుండడంతో మంటలు చెరువుమాధారం, బైరవునిపల్లి గ్రామాల వైపు రాగా.. రైతులు మోటార్ల ద్వారా పొలాల్లో నీళ్లు చల్లారు. అంతలోనే పంచాయతీకి చెందిన ట్యాంకర్ చేరుకోవడంతో మంటలను అదుపు చేశారు. అయితే, అప్పటికే నేలకుర్తి సత్యనారాయణరెడ్డి, ఎస్.కే.ఖాదర్, పగిడిపత్తి బాలయ్య, పగిడిపత్తి వెంకటేశ్వర్లు, బెల్లంకొండల లక్ష్మీనారాయణకు చెందిన వ్యవసాయ మోటార్లు, పైపులు కాలిబూడిద కావడమే కాక పలువురి పొలాల్లో తాటిచెట్లు సైతం కాలిపోయాయి.

మొక్కజొన్న పంట దగ్ధం

మధిర(చింతకాని): మండలంలోని లచ్చగూడెం, నేరడ గ్రామాల్లో నాలుగెకరాల మొక్కజొన్న పంట మంగళవారం కాలిపోయింది. ఎండ తీవ్రతతో చెత్తకు నిప్పంటుకోగా ఈదురుగాలులకు మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో రైతులు మేకపోతుల శివ, శ్రీరాముల జమలయ్య, మునగంటి పుల్లయ్యకు చెందిన మొక్కజొన్న పంట దగ్ధమైంది. అలాగే, పొలాల్లోని మోటార్లు, పైపులు సైతం మంటలకు కాలిపోగా సుమారు రూ.2.50 లక్షల వాటిల్లిందని రైతులు తెలిపారు. ఈమేరకు సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటల్ని అదుపులోకి తీసుకవచ్చారు. అలాగే, నేరడలో ఓ ప్రైవేట్ నెట్‌వర్క్‌కు చెందిన సెల్ టవర్‌కు కూడా మంటలు అంటుకోగా సిబ్బంది మంటలను అదుపు చేశారు.